క్లుప్తంగా

పేదలకు అండగా ప్రభుత్వం



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని కే. సావిత్రి అనే మహిళకు మెదడులో కణతి సమస్య తలెత్తడంతో చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, నాయకులు గడ్డం హన్మండ్లు, పుల్కం రాజు, గోస్కుల రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

వీర్నపల్లి: మలేషియాలో అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని గర్జన్‌పల్లి సీతారాం నాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ బావుసింగ్(60) కుటుంబానికి మా సేవాలాల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ రూ.18,650 నగదు, 25 కేజీల బియ్యం అందజేసింది. భార్య, ఐదుగురు ఆడపిల్లలు ఉన్న ఈ బీద కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కుటుంబంలో చదువుకున్న ఇద్దరు అమ్మాయిలకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవి, అజ్మీరా విజయ్, ధరవత్ నవీన్, చందు, నరేశ్, అరుణ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రుద్రంగి: మండలం దెగావత్ తండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ దెగావత్ సరిత శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, కార్యదర్శి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి, జీపీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల ముందే విక్రయాలు..

- రోడ్ల మీద అమ్మకానికి సిద్ధంగా ధాన్యం కుప్పలు
- ధర విషయంలో దళారుల ఇష్టారాజ్యం
- మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

వేములవాడరూరల్: ఒకవైపు వరి కోతలు ఊపందుకుంటున్న వేళ. ప్రభుత్వం ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కోతలు పూర్తయి, చేతికి వచ్చిన పంట విక్రయించేందుకు నానా యాతన పడుతున్నారు. ఇంటి ముందే ధాన్యం ఆరబెట్టి, కుప్పలుగా పోసి దళారులకు తక్కువ ధరకైనా అమ్ముకునేందుకు సిద్ధపడుతున్న దయనీయ పరిస్థితి కనిపిస్తోంది.



రోడ్లపైనే ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

యాసంగి వరి పంట చేతికి వచ్చినా, ఇంకా చాలా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి, రుద్రంగి ప్రాంతాల్లో ఇప్పటికే వరి పంట కోతలు ప్రారంభించి ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉంచారు. చాలామంది రైతులు ధాన్యం ఆరబోసేందుకు, నిలువ చేసేందుకు స్థలం లేక ఇంటి ముందే ఆరబోసి, విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారు. ధర ఏదైనా ఇప్పటికే ప్రైవేట్ వ్యాపారులు పల్లెల్లో రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ దళారులకు విక్రయించక తప్పడం లేదు.

మొగులు.. గుబులు

సాయంత్రం సమయంలో ఈదురుగాలులు రావడంతో ఆరబోసిన ధాన్యం నష్టం జరుగుతుందని ప్రభుత్వ ధర కంటే తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ రూరల్ మండలాల్లో ప్రధానంగా పత్తితో పాటు వరి పంటను రైతులు సాగు చేస్తారు. ఈ సంవత్సరం పత్తి పంటను కూడా సీసీఐ అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకే విక్రయించారు. ఇక వేములవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితమే బాలనగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే



రోడ్ల మీదనే ధాన్యం కుప్పలు

రమేశ్‌బాబు చేతుల మీదుగా కొనుగోళ్లను ప్రారంభించారు. వేములవాడ మండలంలో మాత్రం ఇప్పుడే వరి కోతలు ప్రారంభం కాగా ఇతర మండలాల్లో మాత్రం కోతలు జోరందుకున్నాయి. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు 10 వేల ఎకరాల వరకు వరి పంటను సాగు చేయగా 2 లక్షల 80 వేల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

స్థలాల కొరత

వేములవాడ మండలంలోని 17 గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. కాని చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉండడం వల్ల సొసైటీ అధికారులు ప్రైవేటు స్థలాల కోసం అన్వేషిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు ఉండగా మరికొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో ప్రైవేటు స్థలాలను అద్దెకు తీసుకుని ధాన్యం కొనుగోలు చేస్తారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు ధాన్యం తీసుకువచ్చి ప్రైవేటు స్థలాల్లో ఆరబోస్తున్నారు.

కల్లాల్లో ఆరబెట్టాం



వరి కోతలు ఎప్పుడో ప్రారంభించినం. ఇప్పటికే ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టినం. మ్యాచర్ వచ్చింది. కాని ఇంకా ప్రభుత్వం తరుపున కొనుగోళ్లు ప్రారంభించలేదు. స్థలాల కొరత ఉన్నది. అందుకే వెంటది వెంట ధాన్యాన్ని కొనుగోలు చేస్తే మిగతా రైతులకు ఇబ్బంది ఉండదు.

– మల్లేశం, రైతు, ఫాజుల్‌నగర్

కొనుగోళ్లు ప్రారంభించాలి



వరి కోతలు జోరందుకున్నాయి. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి కల్లాల్లో ఆరబోస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చినుకుపడితే పడ్డ కష్టమంతా నీళ్ల పాలైతది. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి.

– సామ మహేందర్‌రెడ్డి, రైతు, లింగంపల్లి

రైతులు తొందరపడొద్దు



వేములవాడ మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ఇప్పటికే బాలనగర్‌లో ప్రారంభించాం. మిగతా ప్రాంతాల్లో కూడా ప్రారంభిస్తాం. రైతులు తొందరపడి ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించొద్దు. ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలి. – ఏనుగు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, వేములవాడ

కోతలు ప్రారంభమయ్యాయి



వేములవాడ మండలంలో వరి నాట్లు కొంత ఆలస్యం కావడంతో కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. దళారులను ఆశ్రయించకుండా రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలి.

– సాయికిరణ్, ఏవో, వేములవాడ

‘చేసిన సేవను ప్రజలు మరిచిపోరు’

చందుర్తి: ప్రతిమ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని స్థానిక జెడ్పీటీసీ నాగం కుమార్ కొనియాడారు. మండలంలోని నర్సింగపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ప్రతిమ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని వికాస్‌రావు–దీప దంపతులతో కలిసి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలో 10కి పైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళ ఉపాధి కోసం కుట్టు శిక్షణ కేంద్రాలు, మల్యాల, నర్సింగపూర్ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారని, మిగతా పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. వికాస్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలతో తమ కుటుంబానికి ఉన్న బంధంతోనే సేవ చేయాలని ముందుకు వచ్చా



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కుమార్

నన్నారు. ప్రజలకు సేవ చేయడంలో నిజమైన సంతోషం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపెల్లి గంగాధర్, ఉపసర్పంచ్ కాసారపు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీరాజం, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్ల శాంతినగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఏళ్ల కింద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సిమెంట్ స్తంభం విరిగిపోయి ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. నెలల తరబడి అధికారులకు, సెస్ ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వెంటనే కొత్తట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి:
రామకృష్ణ,
సెస్ మేనేజింగ్ డైరెక్టర్
ఫోన్ నంబరు:
94408 14058



సమాచారం

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ శిబిరానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 42 రోజుల పాటు హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్‌లో శిక్షణ శిబిరం నిర్వహించబడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నియామకం

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

ముస్తాబాద్: పోతుగల్ విశ్వబ్రహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కనపర్తి శంకర్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌చారి, కోశాధికారిగా పెంటాచారి, కార్యదర్శిగా కల్వకోట రాజు, గౌరవ అధ్యక్షుడిగా నందంచారి ఎన్నికయ్యారు.

బీకేఎస్ జిల్లా కోశాధికారిగా రామాగౌడ్

సిరిసిల్లటౌన్: భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కోశాధికారిగా కందుకూరి రామాగౌడ్‌ను నియమించినట్లు సంఘ్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ ప్రకటించారు. అనుబంధ సంఘం రైతు సెల్ విభాగం కార్యకర్తల జాబితాను ప్రకటించారు. చీకోటి అనీల్‌కుమార్(మార్కెటింగ్), వెంకటేశ్(జలం), పులి సతీష్‌గౌడ్(ఫసల్‌బీమా), పరుశురాములు(రోజ్‌గార్), వెంకట్‌రెడ్డి(చెరుకు), గడ్డం రాజిరెడ్డి(పశుపోషణ), శ్రీనివాస్‌రెడ్డి(సీడ్), శ్రీనివాస్‌రావు(ఆర్గానిక్ వ్యవసాయం), నారాయణరెడ్డి(రెవెన్యూ), అంజయ్య(లీగల్), నాగుల వసంత (మహిళ సాధికారత) బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై ప్రేమ్‌దీప్

వేములవాడరూరల్: మండలంలోని కోనాయిపల్లి హైస్కూల్‌లో శుక్రవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులపై చేయాల్సిన ఫిర్యాదులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. వాట్సప్ మెసేజ్ పెట్టినా స్పందిస్తామన్నారు. ఈ విషయం మహిళలు, అమ్మాయిలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 వేలు విరాళం

వేములవాడరూరల్: వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ ఆలయ నిర్మాణానికి వేములవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దిండిగాల నారాయణ, పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన నిషాని రాజు కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ బి. గంగాధర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఉపేందర్, నిమ్మపల్లి మేనేజర్ జాకిఉల్లా బేగ్ మీర్జా, వీర్నపెల్లి మేనేజర్ రుపేందర్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ ప్రాంతీయ అధికారి చిట్ల సనత్, రామ్ కిషన్, సర్పంచ్ అరుణ, కొండాపూర్ సర్పంచ్ మల్యాల దేవయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండాకు చెందిన మాలోత్ దివ్యకు రూ.19 వేల చెక్కును బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాదావత్ రవి శుక్రవారం అందచేశారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుగులోత్ శ్రీరామ్ నాయక్, వార్డు సభ్యులు.నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, అనంతారం, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే తనకు ఫోన్ చేయాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గౌడుగు తిరుపతి, సర్పంచులు ఉన్నారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు ప్యాక్స్, 22వ వార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ వి జయ్‌కుమార్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పెద్దూరు సింగిల్‌విండో చైర్మన్ కిషన్, కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్యాక్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



సిరిసిల్లలో ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నాంపెల్లి, కొడుముంజ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ మేకల రవి శుక్రవారం ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ భీరెడ్డి సల్మారెడ్డి, వైస్ చైర్మన్ శీలం రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామ పరిధిలో శుక్రవారం సిరిసిల్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బండి దేవదాస్ ప్రారంభించారు.

వీర్నపల్లి: మండలంలోని బావుసింగ్ నాయక్ తండా,బాబాయి చెరువు తండా, రంగంపేట గ్రామాల్లో శుక్రవారం అల్మాస్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూలతో కలసి ప్రారంభించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, దుమాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పిల్లి రేణుక ప్రారంభించారు. సింగిల్‌విండో చైర్మన్ వుచ్చిడి మోహన్‌రెడి పాల్గొన్నారు.

గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

కోనరావుపేట: గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చల్మెడ ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని వట్టిమల్లలో శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము స్వప్న, వేములవాడ ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన

సిరిసిల్లఅర్బన్ : కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్ ఆధ్వర్యంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి డబ్ల్యూహెచ్‌వో అధికారి డాక్టర్ అతుల్ నగిమే హాజరై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాక్సిన్ల ద్వారా నియంత్రించే వ్యాధుల గురించి తదితర అంశాలపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులంలో రెజ్లింగ్ శిక్షణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రెజ్లింగ్‌పై కోచింగ్ సెంటర్‌ను శనివారం ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సమ్మర్ కోచింగ్ సెంటర్‌లో గిరిజన, సాంఘీక సంక్షేమ, వెనుకబడిన తరగతుల గురుకులాల నుంచి 90 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. రెజ్లింగ్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇఫ్తార్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ముస్లింలకు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సంక్షిప్త వార్తలు

పాఠశాలకు వాటర్ ప్లాంట్

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి ప్రాథమిక పాఠశాలలో విరాళంగా అందజేసిన మినరల్ వాటర్ ప్లాంట్, కంప్యూటర్, ప్రింటర్, ఆటవస్తువులను ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ శుక్రవారం ప్రారంభించారు.

రైతులను ఆదుకోవాలి

గంభీరావుపేట: అకాల వర్షాలకు, పిడుగుపాటుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు, సెస్ మాజీ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు.

ముస్లింలకు రంజాన్ తోఫా

చందుర్తి: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నాడని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ముస్లింలకు రంజాన్ కానుకలను తహసీల్దార్ ఎండీ మజీద్, జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ లావణ్య కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందుర్తి సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: స్థానిక జీపీ కార్యాలయం ఎదుట ముస్లింలకు వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య. మానాల సర్పంచ్ అల్లూరి మానస రంజాన్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, ముస్లింలు, పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాలు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా నిత్యావసర వస్తువులను జేఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ జూకంటి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం పంపిణీ చేశారు.

వీడ్కోలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్ ఒగ్గు ఉమరాజేవం, కోఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి బాలయ్య, పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని గూడెం, మోహినికుంట ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

కోనరావుపేట: మండలం మామిడిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.

పాఠశాలలు, అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో, మల్యాల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు.

వార్షికోత్సవం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, డీఈవో రమేశ్‌కుమార్ పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ వేణుగోపాల్, జెడ్పీటీసీ ఉమ, ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, హెడ్‌మాస్టర్ రంగనాథశర్మ పాల్గొన్నారు.

